
సాక్షి
ఒడిశా
గురువారం । 22 । జూన్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,13,113లు, బంగారం 1.72 గ్రాములు, వెండి 70.5 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



సంపూర్ణ యోగం

• ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

- 8లో



నిరాటంకంగా నీలమేఘ శ్యాముని యాత్ర

- 8లో

న్యూస్‌రీల్

బడి బాట..



పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు

బరంపురం: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు బుధవారం నుంచి పునః ప్రారంభమయ్యాయి. వేసవి సెలవుల అనంతరం ఈనెల 14నుంచి బడులు తెరవాల్సి ఉండగా.. ఎండతీవ్రత ఎక్కువగా ఉండటంతో మరో వారం వాయిదా వేశారు. ఈ గడువు ముగియడంతో మధ్యమిక, ఉన్నత విద్యా బోధన పాఠశాలు తెరుచుకున్నాయి. దీంతో దాదాపు 2నెలల అనంతరం పాఠశాలల్లో సందడి వాతావరణం కనిపించింది.

బస్సు ఢీకొని యువకుడి మృతి



ఘటనా స్థలంలో కలియా మృతదేహం

కొరాపుట్: బస్సు ఢీకొని యువకుడు మృతిచెందిన ఘటన జిల్లాలోని బగ్గయిపాదర్ జంక్షన్ వద్ద బుధవారం చోటు చేసుకుంది. హైదరాబాద్ నుంచి కొరాపుట్ వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు.. జయపురం నుంచి జయపురం వైపు వెళ్తున్న ఎదురుగా వస్తున్న స్కూటీని అదుపుతప్పి, ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కొరాపుట్‌లోని పూజారిపుట్‌కు చెందిన కలియా(25) అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు వాటర్ సర్వీసింగ్ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఇదే ఘటనలో మరో గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడగా.. అతనిని కొరాపుట్‌లోని సాహిద్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. కొరాపుట్ సదర్ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూఢ నమ్మకాలు కల్పిస్తే కఠిన చర్యలు

- ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు కార్యచరణ: కలెక్టర్

పర్లాకిమిడి: చేతబడి, నాటువైద్యం, క్షుద్ర పూజలు వంటి మూఢ నమ్మకాలతో మారుమూల గ్రామాల్లో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ లింగరాజ్ పండా హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం జరిగిన జిల్లాస్థాయి విచ్ హంటింగ్ కర్మశాలలో ఆయన పాల్గొన్నారు. జిల్లాలో చేతబడి, ఇతర మూఢ నమ్మకాలు, నాటు వైద్యం ద్వారా రోగాలు నయం చేస్తామన్న వ్యక్తులపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తామని తెలిపారు. వీటి పేరుతో జనాన్ని మోసం వ్యక్తులపై ఒడిశా మూఢ నమ్మకాల చట్టం-2013 ప్రకారం మూడేళ్ల వరకు జైలు, రూ.5 వేల వరకు జరిమానా విధిస్తామని స్పష్టంచేశారు. అలాగే ఇప్పటి వరకు ఇటువంటి కేసుల్లో పట్టుబడిన వారికి సైతం ఇదే చట్టం వర్తింపజేస్తామన్నారు. దీనిపై గ్రామాల్లో అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, పంచాయతీ ప్రతినిధులు ప్రచారం చేయాలని సూచించారు. అంతకుముందు అవగాహన కరపత్రాలను విడుదల చేశారు. డీఆర్‌డీఏ పీడీ రమాంచల్ ఖమారీ, ఐటీడీఏ పీఓ ఫాల్గునీ మాఝి, జిల్లా మానిటరింగ్ అధికారి బంచానిధి దుర్గా, ఏడీఎం(మెడికల్) ఎంకు భుయ్యాన్, జిల్లా సామాజిక సంక్షేమశాఖ అధికారిని మినాతీ దెయి, బికాష్‌కుమార్ మెహరా, డీసీపీయూ అరుణ్‌కుమార్ త్రిపాఠి, సీడీపీఓ, సూపర్‌వైజర్లు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

విశ్రాంత శ్రామికుల నిరవధిక నిరసన



ఆందోళన చేపడుతున్న విశ్రాంత శ్రామికులు

జయపురం: సబ్ డివిజన్ పరిధిలోని గగణాపూర్ సేవా పేపరుమిల్లు విశ్రాంత శ్రామికులు, వారు కుటుంబాలు జయపురం కార్మికశాఖ కార్యాలయం ఎదుట బుధవారం నుంచి నిరవధిక నిరసనకు దిగారు. సంఘం నాయకుడు ప్రమోద్‌కుమార్ మహంతి నేతృత్వంలో జిల్లా లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. పీఎఫ్, గ్రాడ్యూటీ, వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

గుండిచా మందిరం ఆవరణలో రథాలపై భక్తులకు దర్శనమిస్తున్న దేవతామూర్తులు



అద్వితీయం..



దర్పదళనంలో దేవీ సుభద్ర



నందిఘోష్‌పై పూజలందుకుంటున్న జగన్నాథుడు



రథంపై బలభద్రుడు

- రెండో రోజు కొనసాగిన పూరీ జగన్నాథుని వార్షిక యాత్ర
- గుండిచా ప్రాంగణానికి చేరిన రథాలు
- సాయంత్రం అడపా మండపం పైకి చేరుకున్న దేవదేవుళ్లు
- సేవాయత్‌లు.. అనుబంధ వర్గాల సమన్వయ లోపంపై విమర్శలు

భువనేశ్వర్: సుభద్రా దేవి రథం దర్పదళనం, జగన్నాథుని నందిఘోష్ రథం బుధవారం ఉదయం పూరీ గుండిచా ఆలయం ప్రాంగణం శారదా బలికి చేరుకున్నాయి. ప్రస్తుతానికి మూల విరాట్‌లు తమ రథాలపైనే నెలకొని ఉంటారు. గురువారం సాయంత్రం గొట్టి పాహాండి ఆచారంలో గుండిచా ఆలయంలో అడపా మండపానికి తీసుకు వెళ్తారు. అప్పటి వరకు రథాలపైనే దేవుళ్ల నిత్య సేవాదులతో పూజలు నిర్వహిస్తారు. ఇది భక్తులు, యాత్రికులకు కలిసి వచ్చిన అదృష్టంగా భావిస్తారు. వరుసగా 3 రోజులు రథాలపై దేవదేవుళ్లను ప్రత్యక్షంగా కనులారా దర్శించుకునే అవకాశం లభించడం విశేషం. జగన్నాథ దేవాలయంలోని తోబుట్టువుల దేవతల తొమ్మిది రోజుల వార్షిక యాత్ర మంగళవారం ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా అన్ని కార్యక్రమాలు ముందస్తుగా ఖరారు చేసిన దానికంటే సుమారు గంట ముందే ముగిశాయి. ఈ లెక్కన 3రథాలు గుండిచా శారదాబాలి ప్రాంగణానికి ముందస్తుగా కాకున్నా.. సకాలంలో చేరి పోవాల్సిందే. ఊహాతీతంగా బలభద్రుని తాళధ్వజం మినహా మిగిలిన 2రథాల యాత్ర.. అర్ధాంతరంగా నిలిచిపోయింది. దీంతో మూల విరాట్‌ల అడపా మండపం కొలువు నిడివి కుదించుకు పోయింది. యాత్ర అర్ధాంతరంగా నిలిచిపోవడం పట్ల సర్వత్రా పలు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రధానంగా అధికార, సేవాయత్, కార్మిక ఇతరేతర అనుబంధ వర్గాల మధ్య సమన్వయంలో ఘోర వైఫల్యం కారణంగా ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ పొరపాటుతో గుండిచా శారదాబాలి ప్రాంగణానికి సకాలంలో చేరాల్సిన దేవి సుభద్ర దర్పదళన్ రథం బొడొశొంఖొ వద్ద, జగన్నాథుని నందిఘోష్ రథం మాసిమా ఛక్ వద్ద నిలిచిపోయాయి.

సేవల్లో జాప్యం..

ఈ ఏడాది రథయాత్రలో ఊహాతీతంగా అవాంఛనీయ పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయి. యాత్ర ఆరంభంలో సేవాదులు ముందస్తుగా ముగిసిన యాత్ర అర్ధాంతరంగా ముగిసింది. దీంతో తీరికగా రథాలను బుధవారం గుండిచా మందిరం ఆవరణ శారదాబాలి ప్రాంగణానికి చేర్చారు. రథాలపై జరపాల్సిన దైనందిన సేవలను సకాలంలో నిర్వహించడంలో అనుబంధ యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. దీంతో రథాలపై మూల విరాట్‌లు బుధవారం ఉదయం గంటల తరబడి ఉపవాసంతో ఉండాల్సి వచ్చింది. మంగళ హారతి, దంతధావనం సేవాదులు సకాలంలో ముగించి తదుపరి జరపాల్సిన సేవలపట్ల నిర్లక్ష్యం వహించారు. ప్రాతః సమయంలో ముగియాల్సిన గోపాలవల్లభ భోగం ఇతరేతర సేవాదులు ఆలస్యమయ్యాయి. 3 రథాలపై గోపాల వల్లభ సేవ మధ్యాహ్నం 3.45 గంటలకు పూర్తి చేశారు. ఉదయం పూట జరగాల్సిన ధూపసేవ సాయంత్రం 4.55 గంటలకు నిర్వహించారు.



భక్తిభావంతో తన్మయులైన భక్తులు

అంతా కృష్ణమయం..

జగన్నాథుని శ్రీకృష్ణ భగవానుడిగా పరిగణించే భక్తులు అశేషం. రథయాత్ర పురస్కరించుకుని పలు ప్రాంతాల నుంచి ఈ భక్త వర్గం బుధవారం గుండిచా శారదాబాలి ప్రాంగణానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జగన్నాథ, శ్రీకృష్ణ నామ సంకీర్తనతో ఈ వర్గీయులు తన్మయత్వంలో మునిగితేలారు. మరోవైపు రథాలపై మూల విరాట్‌లను దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులతో శారదాబాలి ప్రాంగణం రద్దీగా మారింది. ఇందులో పలువురు విదేశీయులు కూడా ఉండటం ఆకర్షించింది.



హరినామ సంకీర్తనలో భక్తజనం

రోజంతా భక్తుల మధ్యే..

అనుబంధ వర్గాల మధ్య సమన్వయ లోపంతో గుండిచా యాత్ర రెండో రోజు కూడా నిర్వహించాల్సి వచ్చింది. భక్తులు, యాత్రికులు తమకు ఇది కలిసివచ్చిన అదృష్టంగా భావించి యాత్రలో అత్యంత ఉత్సాహంతో పాలుపంచుకున్నారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు ఈ యాత్ర ప్రారంభమైంది. ఉదయం 10.35 గంటలకు చిట్ట చివరగా గుండిచా శారదాబాలి ప్రాంగణానికి దర్పదళనం, నందిఘోష్ రథాలు సురక్షితంగా చేరాయి. మార్గ మధ్యంలో నిలిచిపోయిన మూల విరాట్‌లకు రథాలపై మంగళహారతి సేవ ముగించి, రథాలు లాగడం ప్రారంభించారు. గమ్యం చేరిన చోట రథాలపై దేవుళ్లని గురువారం సాయంత్రం అడపా మండపం పైకి తరలిస్తారు. బుధవారం సాయంత్రం నుంచి రథాలకు గుర్రాలు తొలగించి మూల విరాటులను కిందకు దించేందుకు వీలుగా చారుమళ్లు ఏర్పాట్లు చేస్తారు.




సర్వాంగ సుందరంగా మజ్జిగౌరి మందిరం

- భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం
- రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు

రాయగడ: స్థానిక మజ్జిగౌరి మందిరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు అన్నారు. రాష్ట్ర 5టీ కార్యదర్శి వి.కార్తికేయ పాండ్యన్ ఈనెల 7న రాయగడ పర్యటించిన సందర్భంలో మందిరం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దీనికి అనుగుణంగా మందిరానికి ఉచితంగా స్థలం కేటాయించే ప్రక్రియలో భాగంగా రూ.7.01 కోట్ల నిధుల మంజూరుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదించిందని ప్రకటించారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు నిరంతరం కృషి చేస్తోందని ఈ సందర్భంగా నెక్కంటి తెలిపారు. ఇప్పటి వరకు రైల్వే స్థలంలో అమ్మవారి ప్రాంగణం ఉండటంతో అభివృద్ధికి మార్గం లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వ చర్యతో ఏడాదిలోనే మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రధానంగా ఆంధ్రా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ తదితర సుదూర ప్రాంతాల నుంచి ప్రతి మంగళ, బుధ, ఆది వారాల్లో వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారని, దీనిని దృష్టిలో పెట్టుకొని మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తామని వివరించారు.

త్వరలో డీపీఆర్ సిద్ధం..

మందిర ప్రాంగణంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి త్వరలో డిటైల్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్) సిద్ధం చేసేందుకు సన్నాహాలు ప్రారంభిస్తామని నెక్కంటి భాస్కరరావు తెలిపారు. పనులను ప్రైవేటు సంస్థకు అప్పగించి, దీని ప్రకారం అభివృద్ధి చేపడతామన్నారు. కార్యక్రమలో మజ్జిగౌరి మందిరం మేనేజింగ్ ట్రస్టీ రాయిసింగి బిడిక, సభ్యులు, మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్, మాజీమంత్రి లాల్‌బిహారి హిమిరిక తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ నెక్కంటి, పక్కనే రాయిసింగి, పట్నాయక్



మజ్జిగౌరి అమ్మవారు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న మహిళలు

హుండీ ఆదాయం లెక్కింపు..

రాయగడ: ఉత్కళాంధ్రుల ఆరాధ్యదైవం మజ్జిగౌరమ్మ హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం చేపట్టారు. ఆలయ ట్రస్టీ రాయిసింగి బిడిక, సభ్యులు ఇప్పిలి సన్యాసిరాజు, రాధాకృష్ణ దొళాయి, దేవేందర్ బెహరా, మందిరం సూపరింటెండెంట్ బిజయానంద్ మిశ్రా, తహసీల్దార్ తపస్ రౌత్ సమక్షంలో ఆలయ ప్రాంగణంలోని 9 హుండీలను తెరిచారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన లెక్కింపు.. రాత్రి 7గంటల వరకు కొనసాగింది. ఈ నేపథ్యంలో నగదు రూపంలో రూ.58,24,680లు లభించిందని ట్రస్టీ వెల్లడించారు. ఇందులో విదేశీ కరెన్సీ 11 డాలర్లు, 20 పౌండ్స్, 10రియాల్స్ ఉన్నట్లు తెలిపారు. అలాగే మొక్కుబడుల రూపంలో 39 గ్రాముల బంగారం, 1650 గ్రాముల వెండి లభించిందన్నారు. ప్రతి 3నెలలకు ఒకసారి హుండీ తెరవాల్సి ఉన్నప్పటికీ.. ఈసారి 85 రోజుల్లోనే లెక్కించామని పేర్కొన్నారు. హుండీ ఆదాయాన్ని మందిర అభివృద్ధి కోసం వినియోగిస్తున్నామని, ఈ మొత్తాన్ని రాయగడ యూనియన్ బ్యాంక్‌కు తరలించి, డిపాజిట్ చేశామని వివరించారు. లెక్కంపులో సహకారం అందిస్తున్న సేవా సంస్థలకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు

- భువనేశ్వర్ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీపాద కర్మాలకర్

భువనేశ్వర్: 'విద్యాధికులుగా ఎదిగే యువత నిరుద్యోగులుగా ఉద్యోగ అన్వేషణలో తలమునకలయ్యే రోజులు చెల్లాయి. విద్యార్హతలకు అనుగుణంగా సృజనాత్మక భావాలకు స్వయం ఉపాధి రూపురేఖలు అద్ది, యువతరానికి ఉద్యోగాలు కల్పించే దిశలో ఎదగాల్సిన రోజులు చేరువయ్యాయి. ఈ పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థుల్లో సృజనాత్మక విలువలతో కూడిన ఆలోచనలను వెలికి తీసేందుకు ఈనెల 22 నుంచి 26వరకు 5 రోజుల ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్న'ట్లు ఇండియన్ ఇనిస్టిట్యూటు ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) భువనేశ్వర్ క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీపాద కర్మాలకర్ వెల్లడంచారు. ఈ వ్యవధిలో దేశ వ్యాప్తంగా భువనేశ్వర్, చెన్నై, పూణే, భోపాల్, గౌహతి, ఛండీగఢ్ ప్రాంతాల్లో సృజనాత్మకత, అలంకరణ, పారిశ్రామికత(ఐడీఈ) బూట్‌క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక క్యాంపస్‌లో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేస్తున్న శిబిరంలో దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 350మంది అభ్యర్థులు పాల్గొంటున్నారన్నారు. వాధ్వాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థుల నుంచి కళాశాల, ఇతర ఉన్నతశ్రేణి సంస్థల విద్యార్థులను భాగం చేస్తున్నట్లు పేర్కొన్నారు. స్వయం ఉపాధి, స్టార్టప్ సంస్థల ఏర్పాటు, కార్యాచరణ, ఎదుగుదల మెలకువలు, పలు రకాల ఒడిదుడుకులను అధిగమించే అంశాల పట్ల ప్రత్యేక కార్యక్రమాలు ప్రదర్శించి విద్యార్థి దశ నుంచి ఉద్యోగాలు కల్పించే మానసిక స్థైర్యాన్ని ప్రేరేపించే లక్ష్యంతో దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం గురువారం నుంచి ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ప్రొఫెసర్లు డాక్టర్ దేవీ ప్రసాద్ డోగ్రా, పురబీ పూర్ణాశ మిశ్రా ఆధ్వర్యంలో పలువురు నిపుణులతో కూడిన కమిటీ శిబిరం ఆద్యంతాలు విజయవంతంగా నిర్వహించే కార్యకలాపాలు పర్యవేక్షిస్తుందన్నారు. సీఓఈపీ టెక్నికల్ యూనివర్సిటీ పూణే నుంచి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో ప్రారంభించనున్నట్లు వివరించారు.



మాట్లాడుతున్న ఐఐటీ డైరెక్టర్ శ్రీపాద కర్మాలకర్, పక్కన బూట్‌క్యాంప్ నిర్వాహకులు

క్లుప్తంగా

బైక్‌ను ఢీకొన్న ట్యాంకర్: ఇద్దరికి తీవ్ర గాయాలు

బొండపల్లి: మండలంలోని చందక పేట జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహనాన్ని ఓ ఢీకొనడంతో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సాలూరుకు చెందిన కానూరి లక్ష్మి, కానూరి శంకర్రావులు సాలూరు నుంచి విజయనగరం ద్విచక్ర వాహనంపై వస్తుండగా విజయనగరం నుంచి రాయగడ వెళ్తున్న ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరు తీవ్రంగా గాయపడగా ట్యాంకర్ అదుపు తప్పి బోల్తా పడింది. గాయపడిన ఇద్దరిని 108 వాహనంలో విజయనగరంలోని సర్వజన కేంద్రాస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై ఎస్.రవి పరిశీలించి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు.

బైక్‌ను లారీ ఢీకొని మరో ఇద్దరికి..

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని వస్త్రపురికాలనీ వద్ద బుధవారం జరిగిన బైక్‌ను లారీ ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు గాయాలపాలయ్యారని సీఐ కె.రవికుమార్ తెలిపారు. తెర్లాం మండలం అప్పలంపేట గ్రామానికి చెందిన చిన్నప్పడు, ఆదినారాయణలు ద్విచక్ర వాహనంపై రాజాం వస్తుండగా రాజాం నుంచి తెర్లాం వెళ్తున్న లారీ ఢీకొనడంతో గాయాలపాలయ్యారన్నారు. వెంటనే స్థానికులు 108 సహాయంతో రాజాంలోని ప్రైవేట్ ఆస్పత్రికి వారిద్దరినీ తరలించగా చికిత్స పొందారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఆస్పత్రిని పరిశీలించిన డీఐజీ

డెంకాడ: చింతలవలస ఏపీఎస్పీ ఐదో బెటాలియన్ ఆస్పత్రిని ఏపీఎస్పీ డీఐజీ బి.రాజకుమారి బుధవారం సందర్శించారు. అక్కడ అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రి రికార్డులు పరిశీలించారు. పాఠశాల, క్యాంటీన్, స్టోర్, ఫ్యూయల్‌స్టేషన్, గ్యాస్ ఏజెన్సీని సందర్శించారు. వెల్ఫేర్ గ్రూప్ అభివృద్ధికి తగు సూచనలు చేశారు. ఆమె వెంట బెటాలియన్ కమాండెంట్ రాహుల్‌దేవ్‌శర్మ తదితరులు ఉన్నారు.

23 నుంచి ఇంజినీరింగ్ కళాశాలల తనిఖీ

- ప్రకటించిన జేఎన్‌టీయూ జీవీ

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం యూనివర్సిటీ అనుమతులు కొనసాగించడం కోసం అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఈ నెల 23 నుంచి వర్చువల్ పద్ధతిలో తనిఖీలు నిర్వహిస్తామని యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కె.బాబులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యాసంవత్సరం 2023-24 నిర్వహణ అనుమతులను కొనసాగించేందుకు సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్ పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలన్నారు. ప్రయోగశాలల నిర్వహణ, కళాశాలల భౌతిక పరిస్థితిని పరిశీలిస్తామని, కళాశాలల పోర్టల్‌లో సమర్పించిన డేటాకు తీసుకుంటామని తెలిపారు.

అన్ని రంగాల్లోనూ రాణించాలి

విజయనగరం క్రైమ్: మహిళా పోలీసులు అన్ని రంగాల్లోనూ రాణించేలా పీటీసీలో ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం ఎస్పీ జీఆర్ రాధిక సూచించారు. ఇంటిలిజెన్స్, స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి 21 వరకు మూడురోజుల పాటు నిర్వహించిన కోర్సు ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శిక్షకులను అభినందించారు. పీటీసీ ప్రిన్సిపల్ టి.ఆనందబాబు మాట్లాడుతూ ప్రతి జిల్లా నుంచి 8 మంది చొప్పున 61 మంది మహిళా సిబ్బంది వివిధ ర్యాంకులలో శిక్షణకు హాజరయ్యారన్నారు. ఎస్ఎస్‌జీ డిప్యూటీ డైరెక్టర్ డి.ఆశీర్వాదం, శిక్షణార్థులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాల పరిశీలన

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లాలోని కేజీబీవీలో ఖాళీగా ఉన్న టీజీటీ, పీజీటీ పోస్టుల భర్తీకి సంబంధించి 320 మంది అభ్యర్థులకు 175 మంది ధ్రువపత్రాలను సమగ్రశిక్ష కార్యాలయంలో బుధవారం పరిశీలించారు. మిగిలిన వారి ధ్రువపత్రాలను గురువారం పరిశీలించనున్నారు.

అత్యాచారాల నిరోధక చట్టం అమలుపై సమీక్ష రేపు

విజయనగరం అర్బన్: ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం అమలుపై ఈ నెల 23న కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఆ రోజు ఉదయం 11.30 గంటలకు జరిగే సమావేశంలో చట్టంలోని నిబంధనల అమలు, అత్యాచార బాధితులకు సహాయం, పునరావాసం చర్యలు, కేసుల సత్వర విచారణ తదితర అంశాలపై సమీక్షిస్తామన్నారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, పర్యవేక్షణ కమిటీ సభ్యులు సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

నెల్లిమర్ల: పట్టణంలోని జూట్‌మిల్లు సమీపంలో రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ బుధవారం మృతి చెందినట్లు జీఆర్‌పీ ఎస్సై చెల్లూరి శ్రీనివాసరావు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో ప్రమాదం సంభవించినట్లు చెప్పారు. మృతురాలి వయసు సుమారు 30 సంవత్సరాలు ఉంటుందని, నీలం, నలుపు రంగు డిజైన్ గల పంజాబీ డ్రెస్, ఎరుపు రంగు చున్నీ వేసుకున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్ 7013273731 నంబరుకు కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు.



బరంపురం: శంకల్ప విద్యాసంస్థలో ధ్యానం చేస్తున్న విద్యార్థులు



పర్లాకిమిడి: సరస్వతీ శిశు విద్యామందిర్‌లో మాట్లాడుతున్న ఆశాలత



జయపురం: యోగాసనాలు వేస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్, పట్టణ ప్రజలు



మల్కన్‌గిరి: విద్యార్థులతో సూర్య నమస్కారాలు చేయిస్తున్న దృశ్యం

సంపూర్ణ యోగం..

- రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవం
- సాధన ప్రాముఖ్యతను వివరించిన వక్తలు



కొరాపుట్: నవరంగ్‌పూర్ కోర్టు సముదాయంలో సూర్య నమస్కారాలు చేస్తున్న న్యాయమూర్తులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా కేంద్రం పర్లాకిమిడిలోని సరస్వతీ శిశు విద్యామందిర్‌లో 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పతంజలి యోగా సమితి, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. యోగా గురు లక్ష్మీనారాయణ పటాన్నాయక్, రంజన్ మహంతి, మురళీ ప్రధాన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. విశ్రాంత ఉపాధ్యాయురాలు ఆశాలతా పాణిగ్రాహి ముఖ్యవక్తగా విద్యార్థులకు యోగాభ్యాసాలు చేయించారు. రోజూ సాధన చేయడం వల్ల శారీరక, మానసిక రుగ్మతలు పోగొట్టుకోవచ్చని యోగా గురు విఘ్నేశ్వర్ దాస్ తెలిపారు. కృష్ణచంద్ర గజపతి కళాశాలలో గురండి కళాశాల, గుమ్మా, కాశీనగర్, ఎస్‌కేసీజీ కళాశాలల ఎన్‌సీసీ క్యాడెట్లు, బాస్కెట్‌బాల్ గ్రౌండ్స్‌లో యోగా గురురంజన్ మహంతి, జిల్లా యోగా ప్రభారి సుశాంత్ మహాపాత్రొ, ఉపాధ్యాయులు శిశిర్‌కుమార్ రథొ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. మహారాజా బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం డి.శ్రీరామ్మూర్తి, జగన్నాథ పట్నాయక్, ఎస్.లక్ష్మణరావు తదితరులు యోగా గురువులను సన్మానించారు.

128 ప్రాంతాల్లో..

బరంపురం: బరంపురం జిల్లా పోలీసు, గోపాల్‌పూర్ ఆర్మీ ఆధ్వర్యంలో యోగా శిబిరం నిర్వహించారు. స్థానిక టౌన్ హాల్ ప్రాంగణంలో బరంపురం మున్సిపల్ కార్పొరేషన్, పతంజలి యోగాసమితి, భారత స్వాభిమాన్ గంజాం శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరం జరిగింది. మండల ప్రహరి డాక్టర్ దేవరాజ్ పాణిగ్రహి, రాజయోగ సమితి ప్రహరి శిశిర్‌కుమార్ దాస్, భారతమాన్ ప్రహరి అభి ప్రధాన్, జిల్లా ప్రచారక్ రవిబాబు పాల్గొన్నారు.

- ఘటాధేశ్వర కల్యాణ మండపంలో సత్యసాయి జ్ఞానమండలి ఆధ్వర్యంలో యోగా గురువు భాస్కర్‌తో ఆసనాలు వేయించారు.
- రామచంద్రపూర్ బ్రహ్మకుమారి ఈశ్వరీయా విశ్వవిద్యాలయ శాంతికుండం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీకే మాల, మంజు తదితరులు పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా 128 ప్రాంతాల్లో అంతర్జాతీయ యోగా శిక్షణ శిబిరం జరిగిందని అధికారులు తెలిపారు.

అమూల్య వరం..

జయపురం: భారతీయ సనాతన సంప్రదాయం అందించిన అమూల్య వరం.. యోగా అని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అభిప్రాయం వ్యక్తంచేశారు. స్థానిక విక్రమదేవ్ కళాశాల మైదానంలో జయపురం పతంజలి యోగసమితి పరివార్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. పతంజలి యోగా సమితి కార్యదర్శి జానకీ పాణిగ్రాహి పాల్గొన్నారు.

ఆరోగ్యానికి పరిరక్షణ..

కొరాపుట్: యోగాతో ఆరోగ్యానికి పరిరక్షణ లభిస్తుందని నవరంగ్‌పూర్ జిల్లా జడ్జి సంజీవ్ దుబే అన్నారు. జిల్లా కోర్టుల సముదాయంలో జరిగిన కార్యక్రమంలో యోగా గురువులు సంతున్‌కుమార్, రస్మికాంత్ నాయక్ యోగసనాల ప్రాముఖ్యతను వివరించారు. ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి మనరాణి మిశ్రా, న్యాయవాదులు పాలక్గొన్నారు. కొరాపుట్ లోని ఒడిశా కేంద్రీయ విశ్వ విద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ చక్రధర్ త్రిపాఠి, డీన్ శరత్ పాలిత తదితరులు పాల్గొన్నారు.

- జిల్లా జడ్జి కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో న్యాయమూర్తి సత్యనారాయణ మిశ్రా, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి డాక్టర్ పవిత్రమోహన సామల్, అదనపు న్యాయమూర్తి సీహెచ్ వాసుదేవ్ పాత్రొ, ముఖ్య విచార విభాగం న్యాయమూర్తి దిలీప్ కుమార్ సాహు, రిజిస్ట్రార్ బిష్ణుప్రసాద్ దేవత, జిల్లా న్యాయసేవ ప్రాధీకరణ కార్యదర్శి సుమన్ జెనా, డిప్యూటీ అడ్మినిస్ట్రేటర్ ఎ.రమేష్‌కుమార్, హెడ్‌క్లర్క్ ప్రదీప్‌కుమార్ మిశ్రా, కోర్టు సిస్టం అధికారి రజనీకాంత లిమా, న్యాయవాదులు పాల్గొన్నారు.
- జయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్కన్‌గిరిలో..

జిల్లా కేంద్రంలోని కళాశాల ప్రాంగణంలో యోగాచార్యులు భువనానంద సాహు, ప్రిన్సిపాల్ లింగరాజ మిశ్రో ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆరోగ్య పరిరక్షనలో యోగా ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో బొమ్మ సంస్థ డైరెక్టర్ వినేష్ మిశ్రా, సూర్యకాంత్ పాణిగ్రహి, అధ్యాపకులు నమిత దొండసేన, ప్రేమలేఖ భోత్రా, గౌతమ్ నాయక్, బీజీ రావు పాల్గొన్నారు.



బరంపురం: గోపాల్‌పూర్ తీరంలో ఆసనాలు వేస్తున్న పోలీసు, ఆర్మీ సిబ్బంది



బరంపురం: యోగా విశిష్టతను వివరిస్తున్న శిక్షకులు



జయపురం: పాఠశాలలో యోగా కార్యక్రమం



కొరాపుట్: నవరంగ్‌పూర్ కోర్టు సముదాయంలో సూర్య నమస్కారాలు చేస్తున్న న్యాయమూర్తులు



జయపురం: యోగా దినోత్సవంలో పాల్గొన్న న్యాయాధికారులు



పర్లాకిమిడి: కృష్ణచంద్ర గజపతి కళాశాలలో ఆసనాలు వేస్తున్న దృశ్యం



మల్కన్‌గిరి: ప్రాణాయామం చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

నిరాటంకంగా.. నీలమేఘ శ్యాముని యాత్ర

- కూర్మావతారంలో దర్శనమిచ్చిన జగన్నాథుడు
- జయపురం, కొరియాలో ఒక రోజు ఆలస్యంగా రథయాత్ర

జయపురం పట్టణం, కొరాపుట్ జిల్లాలోని ఆంధ్రా-ఒడిశా వివాదాస్పద సరిహద్దు ప్రాంతం కొఠియాలో రథాయాత్ర ప్రశాంతంగా, ఎటువంటి అడ్డంకులు లేకుండా గమ్యం చేరింది. దేశవ్యాప్తంగా జరిగిన సంప్రదాయానికి భిన్నంగా ఈ రెండు ప్రాంతాల్లో మరుసటి రోజు యాత్ర సాగించడం విశేషం. ఈ నేపథ్యంలో జయగంట ధ్వానాల మధ్య జగన్మోహనుని యాత్ర దిగ్విజయంగా సాగింది. అలాగే ఇతర ప్రాంతాల్లో గుండిచా మందిరానికి చేరిన జగన్నాథుడు.. బలభద్ర, సుభద్ర సమేతంగా మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. యాత్ర ప్రాంగణాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు చేపట్టారు.

– సాక్షి నెట్‌వర్క్



జయపురం: పట్టణంలో రథాయాత్ర ప్రాంగణంలో భక్తుల రద్దీ



పర్లాకిమిడి: మోహానా బ్లాక్‌లో రథం వద్ద చిన్నారుల పూజలు



బరంపురం: యాత్రలో శంఖం పూరిస్తున్న మహిళా భక్తులు



కొరాపుట్: రథం లాగుతున్న ఏడీఎం రామేశ్వర్ ప్రధాన్



జయపురం: శాస్త్రీయ నృత్యాలు చేస్తున్న కళాకారులు



పర్లాకిమిడి: మాట్లాడుతున్న జెడ్పీ అధ్యక్షుడు తిరుపతిరావు



పర్లాకిమిడి: మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆనంద వాహినీ ప్రతినిధులు



పర్లాకిమిడి: ఒడిస్సీ నృత్యాలు ప్రదర్శిస్తున్న కళాకారులు



కొరాపుట్: రథంపై ఎమ్మెల్యే ప్రీతం పాఢి, మాజీ ఎమ్మెల్యే ప్రఫుల్ల పంగి పూజలు



జయపురం: ఆకట్టుకుంటున్న ఆదివాసీ వాయిధ్య నృత్యకారుడు



బరంపురం: రథాయాత్రలో పాల్గొన్న వేలాదిమంది భక్తజనం

పట్టాలు తప్పిన గూడ్స్

విజయనగరం టౌన్: విజయనగరం రైల్వేస్టేషన్‌లోకి వస్తున్న గూడ్స్ బుధవారం పట్టాలు తప్పింది. విజయనగరం నుంచి పలాస వెళ్లేందుకు రూట్ నంబర్ తొమ్మిదిలో ఖాళీ గూడ్స్ బయలుదేరింది. ట్రాక్ మారుతున్న సమయంలో కిలోమీటర్ నంబర్ 817/37 ట్రాక్ వద్ద చక్రం పట్టా తప్పింది. డ్రైవర్ గుర్తించి వెంటనే బండిని నిలిపివేసి, అధికారులకు సమాచారమందించారు. దీంతో అప్రమత్తమైన అధికారులు విశాఖ నుంచి ప్రత్యేక క్రేన్‌ను తెప్పించి కేవలం గంట వ్యవధిలోనే సమస్యను పరిష్కరించారు. అదృష్టవశాత్తు ఎటువంటి ప్రమాదం సంభవించలేదు.

ఇరిగేషన్ ఉద్యోగుల సహకార సంఘ నూతన కార్యవర్గం

బొబ్బిలి: విశాఖ, విజయనగరం, ర్వతీపురం మన్యం జిల్లాల ఇరిగేషన్ ఉద్యోగుల సహకార సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం నిర్వహించారు. ఈ ఎన్నికకు అధికారిగా చల్లా పద్మజ వ్యవహరించారు. నూతన అధ్యక్షుడిగా ఎం సురేష్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా గుడివాడ రామారావు, కార్యదర్శిగా గొల్లపల్లి రామారావు, ఉప కార్యదర్శిగా పి.రామకృష్ణలు ఎన్నికయ్యారు. డైరక్టర్లుగా మరో ఏడుగుర్ని ఎన్నుకున్నారు. వీరిని సంఘం సభ్యులంతా ఘనంగా సత్కరించారు.

తప్పిపోయిన తల్లీపిల్లల అప్పగింత

రాజాం సిటీ: మండల పరిధి ఇల్లంనాయుడువలస గ్రామానికి చెందిన గంటసాల సుజాత, నాలుగేళ్ల కుమార్తె సంకీర్తన, ఆరు నెలల చిన్నారి సంచరితను కుటుంబసభ్యులకు పోలీసులు బుధవారం అప్పగించారు. ఇందుకు సంబంధించి ఎస్సై పి.నీలావతి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 18 నుంచి భార్యాపిల్లలు కనిపించడంలేదని గంటసాల సత్యధర్ 20న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఫోన్ నంబర్ ఆధారంగా తల్లీపిల్లలు శ్రీకాకుళం జిల్లా గార మండలం ఆడవరం గ్రామంలో మేనమామ ఇంట్లో ఉన్నట్లు గుర్తించారు. దీంతో అక్కడి పోలీస్ సిబ్బంది సహాయంతో వారిని తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్సై నీలావతి తెలిపారు.

వంటపాత్రల విషయంలో గొడవ

పార్వతీపురం: పాఠశాలలో వంటపాత్రల విషయమై ఇద్దరి మధ్య జరిగిన గొడవలో ఓ మహిళ గాయపడింది. ఈ విషయంపై పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొమరాడ మండలం మార్కొండపుట్టి గ్రామానికి చెందిన ఎం.నీలమ్మ పాఠశాలలో ఆయాగా పనిచేస్తోంది. పాఠశాలలో వంటపాత్రలు క న్పించడం లేదని స్కూల్ పక్క ఇంట్లో ఉన్న మ రియమ్మను అడిగింది. వంటపాత్రల విషయ మై మమ్మల్ని ఎందుకు అడుగుతావు అంటూ మరియమ్మ దుర్భాషలాడి నీలమ్మను పలు చోట్ల గాయపరిచింది.

క్లుప్తంగా

కొత్తమ్మ తల్లి ఆలయ పనుల పరిశీలన


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎండోమెంట్ అధికారి చంద్రశేఖర్

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మతల్లి ఆలయంలో చేపట్టిన అభివృద్ధి పనులను జిల్లా ఎండోమెంటు అధికారి ఎస్.చంద్రశేఖర్ బుధవారం పరిశీలించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాద్, ఈఓ వి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

బిందుసేద్యంపై శిక్షణ


మాట్లాడుతున్న పీడీ శ్రీనివాసరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వ్యవసాయ పొలాల్లో డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అమర్చడం, మరమ్మతులు చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు పొందవచ్చని ఏపీఎంఐపీ పీడీ రెడ్డి శ్రీనివాసరావు అన్నారు. శ్రీకాకుళంలో ఫార్మర్స్ ట్రైనింగ్ సెంటర్‌లో బుధవారం ఔత్సాహిక నిరుద్యోగ యువతకు ఏపీఎంఐపీ ఆధ్వర్యంలో బిందు సేద్యంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం కల్పించడమే లక్ష్యంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో 45 మంది యువకులు పాల్గొన్నారు.

నవోదయలో విద్యార్థుల ప్రతిభ

టెక్కలి/వజ్రపుకొత్తూరు రూరల్/సరుబుజ్జిలి: వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి సంబంధించిన ఫలితాలు ఆన్‌లైన్ ద్వారా బుధవారం విడుదలయ్యాయి. టెక్కలికి చెందిన ఎం.శృతిశ్రీ, పి.తేజేశ్వరరావు, కె.సాయిసంజన, కిట్టాలపాడు గ్రామానికి చెందిన ఎం.వేణుగోపాలరావు తదితర విద్యార్థులు ఎంపికయ్యారు. నందిగాం మండలం ఆనందపురం గ్రామానికి చెందిన కణితి కేశవర్ధన్, వై.తేజేశ్వరి తదితర విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. వజ్రపుకొత్తూరు మండలం డోకులపాడు ప్రాథమిక పాఠశాల చిన్నారి వడ్డి హిమ వర్షిణి నవోదయకు ఎంపిక కావడంతో ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు. వెన్నెలవలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న బల్ల ప్రసీత, రొట్టవలస కేరళ ఇంగ్లీషు మీడియమ్ స్కూల్‌లో కోచింగ్ తీసుకున్న సతివాడ ఉదయ్‌కుమార్ ప్రవేశ పరీక్షకు ఎంపికయ్యారు.

జవహర్ నవోదయలో ప్రవేశాలకు ఆహ్వానం

సరుబుజ్జిలి: వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య బుధవారం తెలిపారు. ఆగస్టు 10 లోగా దరఖాస్తు చేసుకోవాలని, జిల్లాలోని ముఖ్యకేంద్రాల్లో 2024 జనవరి 1న పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలలో 3, 4 తరగతులు పూర్తి చేసి 2023-24 విద్యాసంవత్సరంలో 5వ తరగతి చదువుతూ ఉన్నవారు అర్హులని స్పష్టం చేశారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం, ఆమదాలవలస, పలాస, ఇచ్ఛాపురం మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఖాళీగా ఉన్న వార్డు వలంటీర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళంలో వివిధ కేటగిరీల్లో తొమ్మిది, ఆమదాలవలసలో నాలుగు, పలాసలో ఎనిమిది, ఇచ్ఛాపురంలో పది ఖాళీలను భర్తీ చేయాల్సి ఉందన్నారు.

పల్లిపేట సర్పంచ్‌పై దాడి

పోలాకి: మండలంలోని పల్లిపేట సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకురాలు బూస రాజేశ్వరిపై అదే గ్రామానికి చెందిన ధారపు గోవిందరావు దాడి చేసినట్లు ఫిర్యాదు అందిందని పోలాకి పోలీసులు బుధవారం తెలిపారు. తనకు సంబంధం లేని పరిపాలనా విషయాలపై దూషణలు చేస్తూ, మహిళనని కూడా చూడకుండా తనపై భౌతిక దాడికి పాల్పడినట్టు రాజేశ్వరి తన ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. మహిళా సర్పంచ్‌పై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు బెండి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

క్విజ్ పోటీల విజేత ఏపీమోడల్ స్కూల్

సోంపేట: సోంపేట ఆదర్శ పాఠశాలలో బుధవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక సమీకృత, అభివృద్ధి విభాగంలో భాగంగా అఖిల భారత స్కూల్ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు వెన్నెల, శోభారాణి ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. విద్యార్థులకు నగదు బహుమతి, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఎస్.జొరాడు, ప్రిన్సిపల్ చిన్నాజి వర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సాగుతో భూసారం మెండు!


పచ్చిరొట్ట సాగు

- 50 శాతం రాయితీపై విత్తనాలు సరఫరా

ఎల్.ఎన్.పేట: పంటల సాగులో రసాయన ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగం పెంచేందుకు ప్రభుత్వం, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు ఎంతగానో కృషి చేస్తున్నారు. భూసారం పెంచి అధిక దిగుబడులు సాధించేందుకు 50 శాతం రాయితీపై ప్రభుత్వం రైతులకు ఏటా ఖరీఫ్ సీజన్‌కు ముందు పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తోంది. అయితే రైతులు పచ్చిరొట్ట సాగుకు అనుకున్నస్థాయిలో ముందుకు రావటం లేదు. సరైన అవగాహన లేకపోవడం, వరి ఎదలు వేసుకునేందుకు ఎక్కువ మంది మక్కువ చూపటం, ఖరీఫ్ సీజన్ ప్రారంభంతోనే కార్తెలు ప్రవేశించటం, కార్తెల్లో విత్తనాలు వేసుకుంటే దిగుబడులు బాగుంటాయనే అనేక కారణాలతో పచ్చిరొట్ట సాగు తగ్గిపోతుంది.

ప్రయోజనాలెన్నో..

పచ్చిరొట్ట సాగు చేయడం ద్వారా భూసారం పెరుగుతోంది. భూమిలో ఉన్న పోషకాలను చేనుకు సమతుల్యంగా అందివ్వటంలో కీలక పాత్ర పోషిస్తుంది. భూమిలో నత్రజని, సల్ఫర్, పాస్ఫరస్, జింక్ వంటి సూక్ష్మ, స్థూల మూలకాలన్నీ సంవృద్ధిగా ఉంటాయి. చేనుకు కావలసిన పోషకాలను అందించటంలో దోహదపడుతుంది. ఎరువుల వినియోగం తగ్గిపోతుంది. పచ్చిరొట్ట సాగు చేయటం వలన భూమిలో వాన పాములు సంఖ్య పెరుగుతుంది. పంటకు ఉపయోగపడే మిత్ర పురుగులు భూమి పొరల్లో వృద్ధి చెందుతాయి.

ఇలా చేయాలి..

వరుసగా మూడు నుంచి ఐదు సంవత్సరాల పాటు ఖరీఫ్ పంట వేసుకునే ముందు పచ్చిరొట్ట సాగు చేయాలి. పచ్చిరొట్ట విత్తనాలు వేసిన 30 నుంచి 40 రోజుల మధ్యలో పొలాన్ని దమ్ము/దుక్కి చేసుకోవాలి. ఇలా చేయటం వలన పచ్చిరొట్ట మొక్కలు దమ్ముమడిలో పూర్తిగా కుళ్లిపోయి సేంద్రియ ఎరువుగా మారిపోతుంది. జీలుగు, కట్టిజనుమ వంటి రకాల విత్తనాలు ప్రభుత్వం 50 శాతం రాయితీపై రైతు భరోసా కేంద్రాల్లో విక్రయిస్తుంది.

అవగాహన కల్పించాలి



గత కొన్ని సంవత్సరాలుగా పచ్చిరొట్ట సాగుచేస్తునే ఉన్నాం. దమ్ముకు ఉంచిన పొలంలో పచ్చిరొట్ట వేస్తాం. ఈ ఏడాది పచ్చిరొట్ట సాగుకు విత్తనాలు తీసుకున్నాం. అయితే అనేక మంది రైతులకు అవగాహన లేక నష్టపోతున్నారు. అవగాహన కలిగిస్తే రైతులతో పాటు భూసారానికి ఎంతో మేలు చేసిన వాళ్లమవుతాం.

–లుకలాపు రాజారావు, రైతు, మిరియాపల్లి, ఎల్.ఎన్.పేట మండలం

ఆర్‌బీకేల్లో విత్తనాలు



పచ్చిరొట్ట సాగు కోసం విత్తనాలు కావలసిన రైతులు ఆర్‌బీకేల నుంచి పొందవచ్చు. 50 శాతం రాయితీపై విత్తనాలు సరఫరా చేస్తున్నాం. వీటిసాగుపై రైతులకు అవగాహన కలిగిస్తున్నాం. ఎక్కువ వరి ఎదలు వేస్తున్నందున రైతులు పచ్చిరొట్ట సాగుకు ఆశించిన స్థాయిలో ముందుకు రావటం లేదు. ఎద వేసుకున్న పొలంలోను పచ్చిరొట్ట సాగు చేసుకోవచ్చు. 25 రోజుల లోపున్న మొక్కలు పొలంలో కలియదున్నటం వలన భూసారం పెరుగుతుంది.

– పైడి లతశ్రీ, ఏవో, ఎల్.ఎన్.పేట

వర్సిటీ వసతి గృహాల పరిశీలన


విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న వీసీ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలోని వసతి గృహాలను వైస్‌చాన్స్‌లర్ నిమ్మ వెంకటరావు బుధవారం పరిశీలించారు. వంశధార పురుషులు, నాగావళి మహిళల వసతి గృహాలను సందర్శించారు. మహిళల వసతి గృహంలో విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. వసతి గృహం నిర్వహణ, భోజనం నాణ్యత, పరిశుభ్రత, సిబ్బంది పనితీరుని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి సమస్య ఉన్నా తనదృష్టికి తీసుకురావాలని, క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు.

ఆటో నుంచి జారిపడి మహిళకు గాయాలు


చికిత్స పొందుతున్న చిలకమ్మ

మెళియాపుట్టి: ఆటో నుంచి జారిపడి మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన మెళియాపుట్టి ఆల్ ఆంధ్రా రహదారిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సంతలక్ష్మీపురం పంచాయతీ టకోయి గ్రామానికి చెందిన పల్లి చిలకమ్మ పెద్దపద్మాపురం గ్రామంలోని కుమార్తె వద్దకు వచ్చింది. తిరుగు ప్రయాణంలో పెద్దపద్మాపురం నుంచి మెళియాపుట్టి రావడానికి ఆటో ఎక్కింది. ఆల్‌ఆంధ్రా రహదారిలో ఉన్న మర్రిచెట్టు మలుపు వద్ద ఆటోలో నుంచి జారి పడడంతో తలకు బలమైన గాయమైంది. దీంతో ఆటోలో ఉన్న తోటి ప్రయాణికులు, సమీపంలో పనులు చేస్తున్న వేతనదారులు స్పందించి మెళియాపుట్టి పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. బాధితురాలు కుమార్తె ఉర్లాన రాణి ఫిర్యాదు మేరకు మెళియాపుట్టి పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రులు మందలించారని..

- ఇంటర్ విద్యార్థి బలవన్మరణం


భానుమూర్తి మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్: ట్యూషన్‌కి వెళ్లమని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురైన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ-2 వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మేదర వీధికి చెందిన నర్రు మోహనరావు ఆటో నడుపుకుంటూ వచ్చే ఆదాయంతో భార్య దేవి, ఇద్దరు కుమారులతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. వీరికి రెండు ఇళ్లు ఉన్నాయి. ఇందులో ఒకటి అద్దెకు ఇచ్చారు. కాగా పెద్దకుమారుడు భానుమూర్తి ఓ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ట్యూషన్‌కు వెళ్లమని తల్లిదండ్రులు చెప్పినా వెళ్లక పోవడంతో ఈనెల 20వ తేదీ రాత్రి భానుమూర్తిని మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన విద్యార్థి బుధవారం ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో అద్దెకిచ్చిన ఇంట్లో ఎవరూ లేనిసమయంలో కుందకు చీరతో ఉరివేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు. కొద్దిసేపటి తరువాత చూసిన తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య


సిద్ధేశ్వర్ మండల్ (ఫైల్)

టెక్కలి రూరల్: రైలుకింద తలపెట్టి యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషాద ఘటన వలేసాగరం గ్రామ సమీపంలో బుధవారం వేకువజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి గ్రామానికి చెందిన యువకుడు సిద్దేశ్వర్ మండల్ (17) టెక్కలి సమీపంలోని గ్రానైట్ క్వారీలో పనిచేస్తు తోటి స్నేహితులతో కలసి వలేసాగరం గ్రామ సమీపంలో అద్దెగదిలో ఉంటున్నాడు. రోజూలాగే మంగళవారం రాత్రి కూడా స్నేహితులతో కలిసి నిద్రపోయాడు. ఉదయం నిద్రలేచి చూసేసరికి మండల్ కనిపించకపోవడంతో స్నేహితులు ఆందోళన చెందారు. సమీపంలోని రైల్వే ట్రాక్ దగ్గర గాలించగా పట్టాలపై శవమై కనిపించారు. అర్ధరాత్రి సమయంలో పూరీ నుంచి గుణ్‌పూర్ వైపు వెళ్లే రైలు కింద తలపెట్టి ఆత్మహత్య చేసుకొని ఉంటాడని రైల్వే పోలీసులు అంచనా వేశారు. చనిపోవడానికి కారణాలు తెలియరాలేదు. 20 రోజుల క్రితం ఇంటికి వెళ్లి వచ్చాడని.. అప్పటి నుంచి ఏదో ఆలోచనలో ఉండేవాడని తోటి స్నేహితులు తెలిపారు. రైల్వే పోలీసులు వివరాలు సేకరించి కేసునమోదు చేశారు.

ఆటోలో చైన్‌స్నాచింగ్

- వృద్ధురాలిని మాటల్లో పెట్టిన ముగ్గురు మహిళలు
- చాకచాక్యంగా మూడు తులాల బంగారం గొలుసు అపహరణ


బాధితురాలు గొట్టిపల్లి నారాయణమ్మ

మెళియాపుట్టి : చైన్‌స్నాచర్లు రూటు మార్చారు. ఆటో ఎక్కిన వృద్ధురాలిని ముగ్గురు మహిళలు మాటల్లో పెట్టి చాకచాక్యంగా గొలుసు కొట్టేశారు. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెళియాపుట్టి మండలం పెద్దపద్మాపురం గ్రామానికి చెందిన గొట్టిపల్లి నారాయణమ్మ బుధవారం బందపల్లిలో నివాసముంటున్న తన సోదరి సుందరాడ చిలకమ్మ ఇంటికి వెళ్లింది. తిరుగు ప్రయాణంలో మెళియాపుట్టి జంక్షన్‌లో బస్సు దిగింది. పెద్దపద్మాపురం వెళ్లేందుకు ఆటో కోసం ఎదురు చూస్తున్న సమయంలో.. ఓ ఆటో వచ్చి ఆగింది. తామూ పెద్దపద్మాపురం వైపే వెళ్తున్నామని డ్రైవర్ చెప్పడం, అందులో ముగ్గురూ మహిళలే ఉండటంతో వృద్ధురాలు ఆటో ఎక్కింది. మెళియాపుట్టి దాటేలోపే మాటల్లో పెట్టి వృద్ధురాలి మెడలోని మూడు తులాల బంగారం గొలుసును కత్తిరించేశారు. కొద్దిసేపటి తర్వాత రోడ్డు పక్కనే ఆటో ఆపి డీజిల్ అయిపోయిందని చెప్పి వృద్ధురాలిని దించేశారు. ఇంతలో మెడలో గొలుసు లేకపోవడాన్ని గుర్తించి నారాయణమ్మ పెద్దగా అరిచేలోపే ఆటో టెక్కలి వైపు వెళ్లిపోయింది. అనంతరం బాధితురాలు కుటుంబసభ్యులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై నరసింగరావు తెలిపారు.

పాత పింఛన్‌ను పునరుద్ధరించాలని వినతి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఉద్యోగులకు న్యాయపరంగా రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు, పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి అలికాన రాజేశ్వరి కోరారు. ఈ మేరకు శ్రీకాకుళం నగర కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి సంఘ నాయకులతో కలిసి బుధవారం వినతి పత్రం అందించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘ సహాధ్యక్షులు కిలారి నారాయణరావు, జయమ్మ, మహేష్, మోహనరావు తదితరులున్నారు.

ఘనంగా గణపతి హోమం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో వేంచేసిన విజయగణపతి ఆలయంలో ఆషాఢ శుద్ధ చవితి సందర్భంగా గణపతి హోమం బుధవారం జరిగింది. ఆలయ అర్చకులు పెంట సూర్యనగేష్‌శర్మ, శ్రీధర్ శర్మల ఆధ్వర్యంలో స్వామివారికి మూలమంత్ర సహిత హవనాన్ని నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

58 మందికి ఉద్యోగాలు


నియామక పత్రాలను అందజేస్తున్న ప్రిన్సిపాల్ జవహర్

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ డాక్టర్ కణితీష్ ఐటీఐలో స్కిల్‌హబ్‌లో షార్ట్‌టెర్మ్ కోర్సులు పూర్తి చేసుకున్న 58 మంది పలు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పైల జవహర్ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలను బుధవారం అందజేశారు. ఫిట్టర్, ఫ్యాబ్రికేషన్ విభాగాల్లో గ్రీన్‌టెక్, మేధ, షిర్డీసాయి ఎలక్ట్రికల్, మాక్ ఇంటర్ నేషనల్ ఆయిల్ అండ్ గ్యాస్, ఏపీడీవోఎస్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్టు చెప్పారు. ఎంపికైన వారికి రూ. 13,500 గౌరవ వేతనంతోపాటు ఉచిత భోజన, వసతి సౌకర్యాలు ఆయా కంపెనీలు సమకూర్చుతాయన్నారు.

టెన్త్ టాపర్లకు అభినందన

సీతంపేట: పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా నగదు పురస్కారం, ప్రశంసాపత్రం అందుకున్న విద్యార్థులను, హెచ్‌ఎంలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి బుధవారం ప్రశంసించారు. దోనుబాయి ఆశ్రమ పాఠశాలకు చెందిన పాలక గురునాథ్‌కు ఎస్టీ కేటగిరిలో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంక్ రావడంతో సీఎం చేతుల మీదుగా రూ.75 వేలు చెక్కు అందుకున్నారు. సామరెల్లికి చెందిన సవర నందిని తృతీయ స్థానం సాధించి రూ.50వేలు చెక్కు అందుకున్నారు. వీరిని తన కార్యాలయంలో పీవో అభినందించారు. గిరిజన సంక్షేమ శాఖ డీడీ శ్రీనివాసరావు, డిప్యూటీ ఈవో లిల్లీరాణి, హెచ్‌ఎం కె.సుబ్బారావు, సీఎంవో చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఒలింపిక్ డే రన్ విజయవతం చేయాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలో ఈ నెల 23న నిర్వహించనున్న ఒలింపిక్ డే రన్‌ను విజయవంతం చేయాలని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా కేంద్రంలో పొట్టి శ్రీరాములు జంక్షన్ వద్ద ఉదయం 6 గంటలకు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల సమక్షంలో ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. అక్కడి నుంచి కళింగ రోడ్ వైఎస్సార్ సర్కిల్, పాలకొండ రోడ్ డేఅండ్‌నైట్ జంక్షన్, అంబేడ్కర్ జంక్షన్, ఆర్ట్స్ కళాశాల రోడ్డు మీదుగా కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణం వరకు రన్ కొనసాగుతుందన్నారు. అనంతరం కోడిరామ్మూర్తి స్టేడియంలో ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులతో కలిసి సమావేశం నిర్వహిస్తామ ని పేర్కొన్నారు.

అదనపు వసూళ్లు జరగకుండా చర్యలు

- అరసవల్లి ఆలయ ఈవో హరిసూర్యప్రకాష్


హరిసూర్యప్రకాష్, ఈవో

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణస్వామి వారి ఆలయ పరిధిలోని కేశఖండన శాలలో కొందరు క్షురకులు భక్తుల నుంచి అదనపు వసూళ్లు చేస్తున్నట్లుగా తమ దృష్టికి వచ్చిందని ఈవో వి.హరిసూర్యప్రకాష్ చెప్పారు. ఇకపై ఇలాంటి చర్యలు జరగకుండా కఠిన చర్యలు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం మాట్లాడుతూ.. రాష్ట్ర దేవదాయ శాఖ ఉన్నతాధికారులు ఇటీవల ఆదేశించిన మేరకు తలనీలాల టిక్కెట్టు రూ.40కు పెంచామన్నారు. అయితే టిక్కెట్ల ఆదాయమంతా ఇక్కడ అధికారికంగా పనిచేస్తున్న 12 మంది క్షురకులకు చెల్లిస్తున్నామని వివరించారు. గతంలో టిక్కెట్టు ధర రూ.25 ఉండగా, తాజాగా 40 రూపాయలకు పెరిగిందన్నారు. అయినప్పటికీ కొందరు క్షురకులు భక్తుల నుంచి గుండుకు, కత్తెర్లకు అదనంగా డబ్బులు వసూళ్లు చేస్తున్నారని.. ఇది క్షమించరానిదన్నారు. భక్తులు కూడా ఎవ్వరికీ అదనపు డబ్బులు ఇవ్వొద్దనేలా ప్రత్యేక వాయిస్ రికార్డర్‌ను కంటిన్యూగా వినపడేలా కేశఖండనశాలలో ఏర్పాటు చేశామన్నారు. అలాగే ప్రతి క్షురకుడు విధిగా యూనిఫారాన్ని ధరించాలన్నారు. ఆలయ నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కేజీబీవీ స్టేట్ టాపర్‌కు అభినందనలు


జాహ్నవిని అభినందిస్తున్న ఏపీసీ జయప్రకాష్

శ్రీకాకుళం న్యూకాలనీ: జగనన్న ఆణిముత్యాలుకు ఎంపికైన కేజీబీవీ మేనేజ్‌మెంట్ స్టేట్ టాపర్ ఉర్లాన జాహ్నవి(కేజీబీవీ సారవకోట)ను సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్ బుధవారం అభినందించారు. రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన జగనన్న ఆణిముత్యాల రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా ఈ నెల 20న విజయవాడలో సత్కారం అందుకుని నేరుగా జిల్లాకు చేరుకున్న జాహ్నవి, తల్లిదండ్రులు, సారవకోట ప్రిన్సిపాల్‌కు ఏపీసీ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. లక్ష నగదు బహుమతి, ప్రసంశాపత్రం, మెడల్ అందుకోవడం ఆనందంగా ఉందన్నారు.

జూన్‌లో వికసించిన మే పుష్పం



మే నెలలో వికసించాల్సిన పుష్పం జూన్‌లో విరబూసింది. శ్రీకాకుళం నగరంలోని ఇందిరానగర్ కాలనీలో ఉంటున్న వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగిని అరవింద కుమారి పెరట్లో మే పుష్పం విరబూయగా స్థానికులు ఆసక్తిగా చూస్తున్నారు.

-శ్రీకాకుళం కల్చరల్

అమ్మ కడుపు చల్లగా..!

- గర్భిణులకు అల్ట్రాసౌండ్, టిఫా స్కానింగ్ ఉచితం
- తొమ్మిది నెలల్లో రూ.5వేలు వరకు ఆదా అయ్యే అవకాశం
- ఆస్పత్రి ప్రసవాలను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు




శ్రీకాకుళం: గర్భిణుల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అల్ట్రాసౌండ్, టిఫా స్కానింగ్ ఉచితంగా చేయాలని నిర్ణయించింది. గర్భిణులకు తొమ్మిది నెలల్లో నాలుగైదు సార్లు అల్ట్రాసౌండ్, అయిదో నెలలో టిఫా స్కాన్ అవసరం ఉంటుంది. ప్రైవేటు స్కానింగ్ సెంటర్లలో అల్ట్రాసౌండ్ స్కానింగ్‌కు రూ.600, టిఫా స్కానింగ్‌కు రూ.1,500 వెచ్చించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ స్కానింగ్‌లను ఉచితంగా చేయాలని ఇటీవల నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం చేస్తున్న ప్రైవేటు ఆస్పత్రుల్లో కూడా స్కానింగ్ ఉచితంగా నిర్వహిస్తున్నారు.

విప్లవాత్మక మార్పులు..

వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆస్పత్రి ప్రసవాలను పెంచాలని సరికొత్త చర్యలు చేపట్టింది. ఆస్పత్రులు, పీహెచ్‌సీల్లో వైద్యాధికారుల పోస్టులను భర్తీ చేయటంతో ఇప్పటికే సఫలీకృతమైంది. పదోన్నతులు, బదిలీలు ద్వారా జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న వైద్యాధికారుల పోస్టులను భర్తీ చేసింది. ఇప్పటి వరకు ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్యశ్రీ ద్వారా ఆయా ఆస్పత్రుల్లో మాత్రమే ప్రసవాలు జరిగేవి. వైద్యాధికారుల పోస్టులు భర్తీ చేసిన తరువాత ఏప్రిల్ నుంచి పీహెచ్‌సీ స్థాయిలోనే ప్రసవాలు చేస్తున్నారు. దీంతో గర్భిణులకు ఎంతో మేలు చేకూరుతుంది. ఒకవేళ పీహెచ్‌సీలో కాన్పు కష్టతరమై శస్త్రచికిత్స అవసరమయ్యే పరిస్థితి ఉంటేనే సమీపంలోని పెద్ద ఆస్పత్రులకు తరలిస్తారు.

పెరిగిన ప్రసవాలు..

జిల్లాలో 71 పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లు ఉండగా వీటి పరిధిలో మే నెలలో 10 వేల మందికి పైగా గర్భిణీలు తనిఖీలు చేయించుకున్నారు. పీహెచ్‌సీల స్థాయిలో 600 మందికి ప్రసవాలు జరిగాయి. నాలుగు ఏరియా అస్పత్రులు, 13 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఒక జిల్లా ఆస్పత్రి ఉండగా వీటిలో 6029 మంది తనిఖీలు చేయించుకోగా 649 మంది సాధారణ ప్రసవాలు, 454 మంది సిజేరియన్ ద్వారా కాన్పులు జరిగాయి. రిమ్స్ ఆస్పత్రిలో 1439 మంది గర్భిణులు తనిఖీలు చేయించుకుని 110 మంది సాధారణంగాను మరో 104 మంది శస్త్రచికిత్స ద్వారా ప్రసవం చేయించుకున్నారు. నాలుగు ఏళ్ల క్రితం లెక్కలతో పోల్చి చూస్తే ప్రస్తుతం జరుగుతున్న తనిఖీలు, కాన్పులు రెట్టింపు కంటే ఎక్కువగా నమోదు కావటం విశేషం. రిమ్స్‌లో అప్పట్లో గైనిక్ విభాగానికి రెండు యూనిట్లు మాత్రమే ఉండగా ప్రస్తుతం నాలుగు యూనిట్లు పనిచేస్తున్నాయి. దీంతో వైద్యాధికారులు పెరిగి గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందున్నాయి.



గర్భిణులకు మేలు



ప్రభుత్వం స్కానింగ్‌లు ఉచితంగా చేయటం వలన గర్భిణులకు ఎంతో లబ్ధి కలుగుతుంది. 9 నెలల్లో టిఫా స్కాన్ ఒకసారి, అల్ట్రాసౌండ్ స్కాన్ నాలుగు సార్లు అవసరం అవుతాయి. ఈ స్కానింగ్‌లు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగానే చేయిస్తున్నాం.

– డాక్టర్ డి.పార్వతి, గైనిక్ విభాగాధిపతి, రిమ్స్ ఆస్పత్రి, శ్రీకాకుళం

పీహెచ్‌సీ స్థాయిలో ప్రసవాలు



పీహెచ్‌సీ స్థాయిలో ప్రసవాలు చేస్తున్నాం. ప్రతి నెలా పీహెచ్‌సీలకు తనిఖీల కోసం వస్తున్న గర్భిణుల సంఖ్య గతం కంటే పెరుగుతుంది. కాన్పు కష్టం అయితే పెద్ద ఆస్పత్రులకు తరలిస్తున్నాం. అన్ని జాగ్రత్తలు తీసుకుని నిపుణులైన వైద్యులతో కాన్పులు చేయించటం వల్ల మాతా,శిశు మరణాల సంఖ్య తగ్గిస్తున్నాం.

– డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, డీఎంహెచ్‌ఓ, శ్రీకాకుళం

అన్ని ఆస్పత్రుల్లో ప్రసూతి ఓపీ



జిల్లా వ్యాప్తంగా ఉన్న పీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రుల్లో తనిఖీలు చేయించుకునేందుకు వస్తున్న గర్భిణుల సంఖ్య పెరిగింది. స్కానింగ్‌లు ఉచితంగా చేయటం వల్ల ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. గర్భిణులకు మేలు జరిగేలా ఎన్నో కార్యక్రమాలను ప్రభుత్వ చేపడుతోంది.

– డాక్టర్ జరజాపు భాస్కరరావు, డీసీహెచ్‌ఎస్, శ్రీకాకుళం